# ★ నిన్ను దూరం చేసుకోలేను! ★

ముద్దంశెట్టి హనుమంతరావు.

విశ్వలోకంలో జరుగుతున్న అనాచారాల్నీ, అక్రమాల్నీ, కళ్ళారా చూళ్ళేక, మొహం దించుకుని, సూర్యుడు కొండ చాటుకి పోయాడు.

సూర్యకాంతిని చూడలేక ఎక్కడో దాగివున్న తమస్సు, తక్షణం లోకాన్ని ఆక్రమించేసుకుంది.

ఆకాశంలో చుక్కలు తళుక్కున మెరుస్తున్నయ్. ఎక్కడో విమానం నింగిన సాగిపోతున్నట్లు శబ్దం వినిపిస్తోంది.

పాడుపడిన దేవాలయపు పరిసరాల్నీ నిశ్శబ్దాన్ని తమప్రతినిధిగా చేసుకున్నాయి. ఆ వాతావరణంలో దేవాలయపు పైమెట్లు మీద కూచుని యేవో అనంతమైన ఆలోచన సాగిస్తున్నాడు కేశవరావు.

కేశవరావుకి చీకటి చూస్తేనే భయం వేస్తుంది. ఆ చీకటిచూసినపుడంతా అతనికి నిజజీవితం గుర్తుకొచ్చి అలా భయపెడుతుందో యేమో మరి!

* * *

తలిదండ్రుల్ని చిన్నప్పుడే పోగొట్టుకున్న అభాగ్యుడు కేశవరావు. అతని జీవితం చిన్నప్పట్నుంచీ ఒడుదుడుకుల్లోపడి భారంగా, భయంకరంగా సాగింది ఎలాగవుతేనేం - వుద్యోగం అంటూ ఒకటి లభించాక అతని జీవితబాటలో స్థిరత్వమంటూ ఏర్పడి పడిన కష్టాలకు ఫలితంగా సంతృప్తిని కలిగించింది. ఉద్యోగం దొరికిన రెండు సంవత్సరాలకు సరస్వతిని వివాహం చేసుకున్నాడు. "నా" వారంటూ లేని కేశవరావుకి ఆ లోటు తీరింది. సరస్వతి భర్తను దైవంగా భావిస్తూ, సంసారాన్ని స్వర్గంగా మార్చుకుంది. కేశవరావుకి యిదంతా ఓ కొత్త మధుర జీవితంగా అనిపించేది, అటువంటి భార్యను పొందగలిగినందుకు యెంతో గర్వంతో మురిసిపోయేవాడు.

పెళ్ళయిన రెండో సంవత్సరంకి కేశవరావు తండ్రి ననిపించుకున్నాడు. వంశోద్ధారకుడుసాక్షాత్తూ సరస్వతిరూపాన్నే పుణికి పుచ్చుకుని పెరుగుతూంటే, కేశవరావు కొడుకునిచూసే ప్రతిక్షణం ఆనందంతో మురిసిపోతూ ఒక్కక్షణం కూడా వాణ్ణి వదలకుండా వుండేవాడు మరో రెండు సంవత్సరాల తర్వాత మరో అమ్మాయి పుట్టి చనిపోయాక కొడుకుమీద వాత్సల్యం యినుమడించింది కేశవరావు దంపతులకు.

ప్రచురణకు స్వీకరించిన
పోటీ కథానిక

రోజులు గడుస్తున్నాయి. కేశవరావు కొడుకు చంద్రంకి ఏడో యేడు వచ్చేసరికి కేశవరావు సాగిస్తున్న సుఖమయసంసారం కళ్ళారా చూస్తూ సహించలేకపోయింది విధి ఫలితంగా సరస్వతి కలరా వ్యాధి వాతపడి జీవితం ముగించింది.

కేశవరావు కుప్పలా కూలిపోయాడు. అతని హృదయం పగిలిపోయింది కళ్ళల్లో కన్నీరు యింకిపోయింది. తన జీవన పథంలోకి దీపకళికలా ప్రవేశించిన సరస్వతి భౌతికదేహం మీదపడి చిన్న పిల్లాడిలా వలవలాఏడ్చాడు. అతనివ్యధను చూసిన ప్రతివాళ్ళూ బొటబొట కన్నీరు కార్చకుండా వుండలేకపోయారు. కాని యేం చెయ్యగలరు. వేదాంత ధోరణిలో ధైర్యం చెప్పారు. ఆ రోజునుండి కేశవరావు మళ్ళీ చీకటిలో ప్రయాణం చేయవలసివచ్చింది.

రోజులు గడుస్తున్నాయి కేశవరావుకి జీవితంలో మిగిలింది ఒక్క చంద్రమే! వాణ్ణి కంటిపాపలా సాకుతూ వాడికి యేవిధమైన లోటు రాకుండా చూస్తూ వస్తున్నాడు. అప్పుడప్పుడు సరస్వతి జ్ఞప్తికి వస్తూండేది. ఆమెజ్ఞప్తికి వచ్చినప్పుడంతా చిన్నపిల్లాడిలాఏడుస్తుండేవాడు ఆఫీసుకి వెళ్ళినా కొడుకు బడినుండి యింటికి వచ్చి ఒంటరిగా యెంత బెంగపెట్టుకుంటున్నాడోనని ఒక్కరోజు పెందరాళే ఆఫీసునుండి యింటికి వచ్చేవాడు.

ఇరుగు పొరుగు వాళ్ళుకూడా అబ్బాయి పట్ల యెంతో వాత్సల్యాన్ని చూపుతూ వుండేవారు. కాని వారిలో ఒక విధమైన సానుభూతి ఏర్పడింది. పాపం-కేశవరావు ఎన్నాళ్ళిలాంటి జీవితం గడుపుతాడో అనుకునేవారు. కొందరు అనుకునేవారు కేశవరావు పునర్వివాహం చేసుకోవడం శ్రేయస్కరమని. మరికొందరు ఆ అభిప్రాయాన్ని ఖండించేవారు. పునర్వివాహం చేసుకొని తెలిసి తెలిసి నరకంలో ప్రవేశించమంటారా అన్నదే యీ రెండోవర్గం వారి వాదన. మొదటి వర్గంవాళ్ళు వాళ్ళ వాదాన్ని వుపసంహరించుకోలేదు పైగా అందరూ ఒకేలా వుంటారా యేమిటి! అంటూ సమర్ధించేవారు.

మొదటి వర్గం వాళ్ళు, చాలా శ్రద్ధ తీసుకున్నారు. తమ అమూల్యమైన సలహా కేశవరావు చెవిలో వేశారు. అయితే, వాళ్లనుకున్న విధంగా చప్పున ఒప్పుకోలేదు కేశవరావు.

"మళ్ళీ పెళ్ళిచేసుకోవడం, నాకు యిష్టం లేదండీ! అబ్బాయి భవిష్యత్తుకి ఆ ప్రయత్నం ఒక అపస్వరాన్ని సృష్టిస్తుందేమోనని భయమేస్తుంది...." అన్నాడు కేశవరావు.

ఓ పెద్దమనిషి చిన్నగా నవ్వేడు

"ఏమిటి కేశవరావ్, అంత భయపడుతున్నావు? అబ్బాయిని హింసిస్తుందనేగా నీ భయం!" అన్నాడు

"అదే నా భయమండీ!" కేశవరావు జవాబిచ్చాడు.

"మంచివాడివేనోయ్! స్త్రీలంతా ఒకేలా వుంటారని అనుకోవడం, చాలా పొరపాటు స్త్రీ సహజమైన సుమహృదయుల కొందరైనా వుండకుండా పోరు. ఏమో యెవరు చెప్పగలరు! నీ అదృష్టం బావుండి ఓ సహృదయ లభించకూడదా? ఇప్పుడు చూడు- చంద్రం బడినుండి తిరిగి వచ్చి, దిక్కు మొహం వేసుకుని అలా ఒంటరిగా కూచుంటాడు. ఎప్పుడూ యేదో దైన్యం వాడి మొహంలో దోబూచులాడుతూ వుంటుంది. వాణ్ణి చూస్తుంటే మా అందరిలో వల్లమాలిన జాలి పుట్టి, మా హృదయాలు తరుక్కుపోతున్నాయంటే నమ్మ. ఇంట్లో యెవరో ఒకరు వుంటే. వాడలా వుండడు. క్రమంగా వాళ్ళమ్మని మర్చిపోవడానికి ప్రయత్నించి ఉత్సాహాన్ని పుంజుకుంటాడు. ఇక నీ విషయంలో కూడా కొంత మార్పు రావడానికి అవకాశం వుంటుంది. బాగా ఆలోచించు అనకూడదుగానీ- రేపొద్దుట యెప్పుడైనా, నీకు గాని, అబ్బాయికిగాని. అస్వస్థత చేస్తే, ఆదుకునే వాళ్ళుకూడా యింకెవరున్నారు? ఏమైనా సరే- ఆడదిలేని యిల్లు కలకల్లాడదు...."

అంతా మౌనంగా విన్నాడు కేశవరావు అతని దృష్టిపథంలో ఏవేవో వూహాలు, వూహించిన సంఘటనలు, మెదులుతున్నాయి. అవుతే అక్కడున్న మిగతా వ్యక్తులుకూడా అతణ్ణి ఆలోచించడానికి అవకాశం యివ్వకండా, పునర్వివాహం చేసుకోమనే ఉద్ఘాటించారు. కేశవరావు కొస్తంత కరిగిపోయాడు నిజమే! తన అదృష్టమే బావుంటే, సహృదయురాలైన భార్య దొరుకుతుందేమో, ఎవరు చెప్పగలరు! జీవితంలో మరో పందెం ఒడ్డి చూడాలి.... అనుకున్నాడు

అప్పట్నుంచి, కేశవరావు తన పెళ్ళి ప్రయత్నాలు సాగించాడు. అతని ప్రయత్నాల మాట యెలా వున్నా, కొందరు మాత్రం తను పిల్లల్నిస్తామంటూ ముందుకు వచ్చారు. అది కేవలం అతని మంచితనం చూసే, కాని, ఆ అమ్మాయిల వయస్సుకీ తన వయస్సుకీ భేదం అధికంగా వుండటం వల్ల, కేశవరావుకు నచ్చలేదు. మంచిగా చెప్పి తప్పించుకున్నాడు అదే సమయంలో పెద్దల దృష్టి, బాల్య వితంతువైన ఓ పల్లెటూరి పిల్ల కేసి పోయింది. కేశవరావుకి నూరిపోశారు. పల్లెయువతి గాబట్టి మనసు తప్పకుండా మంచిదై వుంటుందని అంతా భావించారు. కేశవరావుకీ అదే అభిప్రాయం కలిగింది. అంతేకాదు.... ఆమె వితంతువై వుండడం ఒక విధంగా మంచిదనుకున్నాడు. వాళ్ళకు వాత్సల్యం అమితంగా వుంటుందిగాబట్టి అబ్బాయిపట్ల సానుభూతి వుండకుండా వుండదనీ.... భర్తంటే వాళ్ళకే యెక్కువ గౌరవం, ఆప్యాయత, భక్తి, వుంటాయని అనుకున్నాడు.... ఎవరి అభిప్రాయాల మాటకేంగాని తన స్వంతఅభిప్రాయాలకు విలువ యివ్వాలిగదా! అందుకే ఒప్పేసుకున్నాడు.

ఓ శుభముహూర్తాన కేశవరావు-కనకంలకు దేవాలయంలో దేవునిసమక్షంలోనేకాక కొందరు పెద్దలసమక్షంలో పెళ్ళిజరిగింది.

కేశవరావు శ్రేయోభిలాషులంతా అమితానందం పొందారు. కేశవరావు తమ మాట నిలబెట్టినందుకు యెంతో గర్వించారు ఆ దంపతులు, ఆదర్శవంతంగా జీవితాన్ని సాగించాలని ఆశీర్వదించారు.

కేశవరావు అబ్బాయిని కనకంకి అప్పజెప్తూ

"ఈ రోజునుంచీ వీడు నీ స్వంత కొడుకే అనుకోవాలి కనకం. సుమారు రెండు సంవత్సరాలక్రితం తల్లిని పోగొట్టుకున్న దురదృష్టవంతుడు వీడు మాతృహృదయపు చల్లదనాన్ని మర్చిపోయాడు. ఆ మమత, వాత్సల్యాలు కరువయ్యాయి. ఆ లోటు నువ్వు తీరుస్తావని నమ్ముతాను. వాడి భారమంతా నీమీదే పెడుతున్నాను" అన్నాడు నెమ్మదిగా.

కనకం, చంద్రిని దగ్గరికి చేరదీసుకుని యెంతో లాలనగా, వాడి జుత్తు నిమురుతూ.

"ప్రత్యేకించి యీ విషయం మీరు చెప్పడం అనవసరమండీ! నాకు మాత్రం తెలీదూ!...." మందహాసంతో అందామె.

ఆ జవాబు కేశవరావుకి యెంతో తృప్తిని కలిగించింది అతను కోరేదికూడా అదేను. ఆమె తప్పకండా తన ఆశయాల్ని నెరవేరుస్తుందన్న నమ్మకం కుదిరింది అతనిలో "ఇంక నేను చెప్పవలసిందేమీ లేదు కనకం, నా హృదయంలో ఆనందం వెల్లువలై పారుతోంది నా జీవితంలో యింత సంతోషాన్ని యెప్పుడూ చవిచూడలేదు...." ఉత్సాహపూరితంగా అన్నాడు.

రోజులు క్రమంగా గడుస్తున్నాయి. కేశవరావు తను యింట్లోవున్నపుడు ఒక్క నిముషంకూడా వృధాపోకుండా కొడుక్కి ఏహాతమో చెప్తూనో లేక ప్రపంచవిషయాలు చెప్తూనో వుండేవాడు. అవుతే రోజులు యెప్పుడూ ఒకేలా వుండవు కొద్ది రోజుల్నించీ కేశవరావు కొడుకుతో ఓ విధమైన నిర్లిప్తత, దైన్యం గూడుకట్టుకొని వున్నట్లు గ్రహించాడు. కారణం ఏమిటో తెలుసుకోవడానికి ప్రయత్నించాడు. కాని లాభంలేకపోయింది, చంద్రింను ఓ నాడు అడిగాడుకూడాను. "ఏమిట్రా అలా వున్నావు?" అని

అవుతే చంద్రిం వున్నది వున్నట్లు చెప్పలేదు. వాడు మొత్తిగా చిన్నవాడేం కాదు. మంచిచెడ్డలు తెలుసుకునే వయస్సుంది. వున్నవిషయం చెప్పి నాన్న హృదయం గాయపర్చడం అతడికి యిష్టం లేకపోయింది అందుకే కొస్తంత ఆలోచించి జవాబుచెప్పాడు. "ఏంలేదు నాన్నా అప్పుడప్పుడూ అమ్మ గుర్తుకొస్తుంది...." భారంగా అన్నాడు.

కొడుకుజవాబు నిజమనే నమ్మేశాడు కేశవరావు, ఔనుమరి అబద్ధం చెప్పవల్సిన అవసరం వాడికేముందనుకున్నాడు, "అమ్మని క్రమంగా మర్చిపోవడానికి ప్రయత్నించు నాయనా! నువ్వు ఎప్పుడూ ఆనందంగా వుంటే నాకూ ఆనందంగా వుంటుంది...." అన్నాడు.

తండ్రి తనపట్ల చూపుతున్న వాత్సల్యం ప్రేమ, చంద్రంని వుక్కిరి బిక్కిరి చేశాయి, అందుకు విరుద్ధంగా సవతితల్లి చూపుతున్న కాఠిన్యత జీవితమ్మీద విరక్తి కలిగిస్తుంది. అతడి కళ్ళముందు యీ విరుద్ధ భావాలు మెదిలాయి. వాటికి స్వరూపం లేకపోయినా తనకు నచ్చిన స్వరూపాన్ని సృష్టించుకున్నాడు. నిజంగా అతని కళ్ళు చెమ్మగిల్లాయి. అవుతే తండ్రి చూడకుండా కళ్ళని ఒత్తుకున్నాడు

ఒకనాడు కేశవరావు ఒంట్లో నలతగా వుందని ఆఫీసునుండి వేగిరంతిరిగివచ్చాడు. ఇంటిగుమ్మం దగ్గరికి వచ్చేసరికి కనకం గొంతుక పైస్థాయిలో వినిపించింది. అతని గుండెలు ఆగిపోయినట్టయ్యాయి. ఆగిపోయి వినడం ప్రారంభించాడు.......... వింటున్నకొద్దీ అతని కళ్ళల్లో కోపం అరుణారిమ కాంతిని పెంపొందిస్తోంది. పెదాలు వణుకుతున్నాయి. అమాంతంగా వెళ్ళి ఆమె పీక నులిమేయాలన్నంత పుక్రోషం వచ్చింది. అయినా నిగ్రహం తెచ్చుకుని నిలదొక్కుకున్నాడు.

"నీకు అంతగా ఆకలివేస్తే చక్కా గ్లాసుడు మంచినీళ్ళు తెచ్చుకుని తాగు, కాఫీకావాలట.... కాఫీ ఇక్కడెవరూ నీకింద చాకిరీ చెయ్యడానికిలేరు...." అంటోంది కనకం.

"మన యింటిపనులు మనంచేసుకోవడం చాకిరీ అనరమ్మా...." తను పుస్తకాల్లో చదువుకున్న విధంగానే అన్నాడు చంద్రం. "నోరు మూసుకో ఎదురు జవాబొకటా? అసలు నీకూ నాకూ వున్న సంబంధం యేమిటి? నా ఖర్మ కాపోతే ఏమిటీ గుదిబండ నాకు? వెళ్ళవతలికి...." మళ్ళీ గర్జించిందామె

"నువ్వు తాగుతున్నావుగదమ్మా కాఫీ అందులో కొస్తంత నాకు ఇస్తే తప్పేమిటి....?'' దీనంగా అడిగాడు చంద్రం.

"నాయిష్టం నేను తాగుతాను. ఒక గ్లాసుడు కాదు .... నాయిష్ట మొచ్చినన్ని గ్లాసులు తాగుతాను. నాకు ఓపికవుంటే నాకు యిష్టమైన వంటకం వండుకుని తింటాను. అడగటానికి నువ్వు యెవరవూ అంట....?" రెచ్చిపోతూ అందామె

చంద్రం యింక సహించలేకపోయాడు అతను. యెంతో సర్దుకు పోవాలనుకుంటే. ఆమె అంత రెచ్చగొడుతోంది.

"నాన్న సంపాదనలో నాకూ హక్కుందమ్మా...." చివరికి అనేశాడు.

"నోర్మూయ్.... అంటూ చెంప పెడేలు మనిపించింది.

"అమ్మా...." అన్న చంద్రం ఆర్తనాదం, కేశవరావు గుండెల్ని చీల్చుకుని పోయింది. అదో సమ్మెట పెట్టులా తగిలిందతనికి. కేశవరావు యింక సహించలేకపోయాడు. రెండంగల్లో లోపలికిపోయి, కనకం రెండు చెంపలూ వాయించేశాడు పిచ్చివాడికి మల్లే.

"నాన్నా.... నాన్నా.... వద్దు నాన్నా అమ్మని కొట్టకండి...." అంటూ అడ్డపడ్డాడు చంద్రం.

కేశవరావు కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. కొడుకుని దగ్గరికి తీసుకున్నాడు

"నీకున్న పాటి జ్ఞానం లేదురా ఆ పశువుకి. నువ్వు యెన్ని హింసలకి గురి అవుతున్నా, నాకు ఒక్కనాడూ చెప్పేవాడివి కాదు. దిగులుగా వున్నావేమని అడిగితే అమ్మ జ్ఞప్తికి వస్తుందనే వాడివి. ఈనాడు నేనీ సంఘటన కళ్ళారా చూడకపోతే, యింక యెన్నాళ్ళు యీ నరకం అనుభవించేవాడివో!" అంటూ వాపోయాడు.

కనకం ఇన్ని దెబ్బలు తిన్నా, వూరుకోలేదు. "కొడుకుమీదుండే ప్రేమ కొత్తగా కట్టుకున్న పెళ్ళంమీదుంటే. బావుఖ అంత ప్రేమ వాడి మీదుంటే, అసలు మళ్ళీ పెళ్ళిచేసుకోవడం మానేయవల్సింది'' యేడుపు స్వరంతో అంది.

కేశవరావు నిట్టూర్పు విడిచాడు.

"అదే నేను చేసిన తప్పు కనకం, తెలిసి తెలిసి నరకంలోకి ఉరికాను,''

అవుతే నేను వూహించి ఆశించింది స్త్రీ సహజమైన సహృదయంగాని, నీవంటి కిరాతక హృదయంకాదు. ఇప్పుడు విచారించి లాభం యేమిటి? నేను సృష్టించుకున్న నరకంలో నేను బాధలనుభవించక తప్పుతుందా?'' బాధగా అన్నాడు.

"ఈ యింట్లో నేనైనా వుండాలి, ఆ అబ్బాయైనా వుండాలి. ఇద్దరం వుండడానికి వీల్లేదు....'' అందామె.

కేశవరావు నిర్విణ్ణుడయ్యాడు. ఆమె రాక్షస నిర్ణయానికి అచ్చెరువందాడు ఆమె వేపు క్షణంసేపు విస్తుపోయి చూశాడు. ఆ రూపంచూసి శాంత స్వరూపురాలని భ్రమపడ్డాడు మొదట్లో. పల్లెపిల్ల కదా సహృదయం గలదని తప్పుగా అర్థంచేసుకున్నాడు. నిజస్వరూపం యిప్పుడు బైటపడేసరికి ఆమెపై అసహ్యం పుట్టింది.

"కనకం! నీ నిర్ణయాన్ని విని, యేడవాలో, నవ్వాలో అర్థంకావడంలేదు. మొదట్లో నీ నుండి యీ సంసారానికి ఓ స్వర్గాన్ని వూహించాను. కాని, నా వూహ తప్పయ్యింది. ఇంతకీ, వీడు నీకేం అపకారం చేశాడని ఎందుకు నీకు వాడిమీదా కక్ష? నీ స్వంత కొడుకులా చూసుకుంటావని అనుకున్నాను. అందుకు ఫలితంగా పరాయివాడిగా యింటినుండి పొమ్మంటున్నావు... బావుంది....'' అన్నాడు.

కనకం జవాబేమీ చెప్పకుండా వంటగది వేపు చరచరా పోయింది కళ్లు ఒత్తుకుంటూ, కేశవరావు చెమ్మగిలిన కళ్ళను ఒత్తుకు[illegible].

"పద బాబూ, కాఫీ తాగి వద్దాం....'' అన్నాడు.

''వద్దు నాన్నా! ఇప్పుడు నాకేమీ ఆకలిగా లేదు.... వెళ్ళి ఆడుకుంటానండి''

"పోనీలే! యిందా యీ పావలా కాసు తీసి యిచ్చాడు.

చంద్రం భారంగా అడుగులు వేసుకుంటూ బైటికి నడిచాడు. కేశవరావుకూడా బైటికి వచ్చాడు.

ఆ రోజే కేశవరావు పాడుపడ్డ దేవాలయం మెట్లమీద కూచుని యివన్నీ నెమరుకు తెచ్చుకుంటున్నాడు.

బాగా చీకటి పడింది. అతని మెదడు ఆలోచనలతో చిందరవందరయ్యింది. ఈ పరిస్థితిల్లో తను యేం చెయ్యాలో అతని ఊహాకి అందడంలేదు.

"నాన్నా" అనుకుంటూ వచ్చాడు చంద్రం.

"ఏం బాబూ!" ఆత్రంగా లేచి నుంచుని కొడుకు దగ్గరికి పోయాడు కేశవరావు.

"ఇంటికి పదండి నాన్నా! నా కెందుకో భయమేస్తుంది. అమ్మ పడుకుంది...." నిరుత్సాహంగా అన్నాడు చంద్రం.

కేశవరావు ఆశ్చర్యపడలేదు కొడుకుని దగ్గరికి చేరదీసుకున్నాడు.

"పోనీ నాన్నా! నన్ను తాతగారింటికి పంపేయండి అక్కడే చదువుకుంటాను నువ్వు నా గురించి యింత బాధపడ్డం యెందుకు?" కాస్తంత వూహ తెలిసిన వాడు గాబట్టి, మనసుకి పట్టే మాట అనేశాడు.

ఆ మాటలు కేశవరావు మనస్సుని మరింత కలచివేసినై.

"అలా అనకు బాబూ! నిన్ను నేను దూరం చేసుకోలేను మీ అమ్మ పోయినా, నిన్ను చూసుకునే, ఓ విధంగా తృప్తిపడుతున్నాను. అదే నాకు ఆనందం పద అలా హోటలుకి పోయి భోజనంచేసి వద్దాం...." అంటూ కొడుకుని తీసుకుని బైలుదేరాడు.

"మరి అమ్మ భోజనం మాట?" చంద్రం అడిగాడు.

"ఆ విషయం నీ కెందుకులేరా- పద" అంటూ ముందుకు సాగాడు కేశవరావు.

భోజనాలు ముగించి యింటికి వచ్చారు తండ్రీ కొడుకులు, ఇంట్లో అడుగు పెట్టే సరికి, కనకం యెదురయ్యింది.

"ఇల్లంటూ ఒకటుందనిగుర్తు లేదేమిటి మీకు?" అంది విసురుగా

కేశవరావుకి వళ్ళు మండిపోయింది.

"గుర్తువుతే వుంది కాని, ఆ యింట్లో ఓ బ్రహ్మరాక్షసి కాపురముంటున్నదన్న విషయం గుర్తుకొచ్చేసరికి భయంతో కాళ్ళు వెనక్కిపడుతున్నాయి." అన్నాడు

కనకం రివ్వున లేచింది.

"అవుతే నేను బ్రహ్మరాక్షసినా ఏమిటి మీరన్నమాట!"

"నేనేమి అనడంలేదు... నిన్ను నువ్వే అర్థంచేసుకోగలవు.. నీ స్వరూపమేమిటో నువ్వే తెలుసుకో!"

"మీరు నన్ను క్షణ క్షణానికి అవమానిస్తున్నారు. మీ మాటలు శూలవుపోటుల్లా బాధిస్తున్నాయి, నేనింక యీ యింట్లో వక్కక్షణం వుండను...." అందికోపంగా

"నేను కోరేదికూడా అదే నీయిష్టం వచ్చిన చోటికి వెళ్ళొచ్చు. తెల్లారాక మీ వాళ్ళింటికితీసుకుపోతా, తయారుగావుండు." అంటూ కొడుకుని తీసుకొని గదిలోకి పోయాడు,

కనకం మ్రాన్పడి పోయింది భర్త తనపట్ల మమకారం వదులుకోలేడనే ఆమె భావించింది. కాని కథ అడ్డం తిరిగినందుకు బావురుమంటూ యేడ్చింది. ఆ ఆఖరుయుధం కూడా పని చెయ్యలేదు, అయితే ఒక నిశ్చయానికి వచ్చింది. కొద్ది రోజులు దూరమైతే కుక్కలా మళ్ళీ తన దగ్గరకే వచ్చి తీసుకొస్తాడన్న అహాన్ని సృష్టించుకుని తృప్తిపడింది. ఆ తృప్తితోనే ఆ రాత్రి వుపోషంతో పడుకుంది. భర్త. అబ్బాయి తిన్నారో లేదోనన్న ధ్యాస కూడాలేక పోయిందామెకు.

మరునాటిరోజు కేశవరావు ఆఫీసుకు శలవుపెట్టి కనకంని వాళ్ళ కన్నవారింటికి తీసుకుపోయాడు. మామగారితో జరిగిందంతా చెప్పాడు యెందుకైనా మంచిదని. అల్లుడు చెప్పిందంతా ముసలాయన విని.

"అయినా నాయనా! అబ్బాయిని వాళ్ళ తాతగారింటికి పంపేయగూడదూ? ఆ కుర్రాడికోసం పండంటి సంసారం ఎందుకిలా విచ్ఛిన్నం చేసుకుంటావు. అన్నాడు.


కేశవరావులో ఆ మాటలు విన్నాక మరింత వుక్రోషం వుప్పొంగింది. ఎంతో జీవితానుభవాన్ని సంపాదించిన ఆ పెద్ద మనిషికూడా అటువంటి సలహాయివ్వడం అతనిపట్లకూడా అసహ్యాన్ని రేకెత్తించింది.

"మీవంటిపెద్దలే అలా శలవిస్తే యింక నేనేం చెప్పేది చెప్పండి? ఆఖరిసారిగా చెప్తున్నాను వినండి. అబ్బాయిని నేను దూరంచేసుకోలేను. మీ అమ్మాయిలో మార్పురాకపోతే ఆమెను దూరంచేసుకోవడానికైనా వెనుకంజ వేయను. ఆపైన మీ యిష్టం. అలా వూళ్ళోకి వెళ్ళి వస్తా..." అంటూ విసురుగా బైటకువచ్చి బస్సు స్టాండువైపు చరచరా నడిచాడు. తిరిగి మామగారింటికి పోకుండా నేరుగా తన స్వస్థలం వెళ్ళే బస్సు యెక్కేశాడు.

ఇల్లు చేరుకునే సరికి చంద్రం ఒక్కడూ దిగులుగా కూర్చున్నాడు. వాణ్ణి దగ్గరికి తీసుకుని.

"ఇక నిశ్చింతగా వుండరా బాబూ! నిన్నెవరూ యేమీ అనలేరు. అనవసరంగా ఓ నరకాన్ని సృష్టించి, నీ సున్నిత హృదయాన్ని గాయపర్చాను ఏది యేమైనా సరే నిన్ను దూరం చేసుకోను చంద్రం! నిన్ను దూరంచేసుకోను" అంటూ కొడుకును హృదయానికి హత్తుకున్నాడు కేశవరావు.

---o---



తీయని తలపులు

చిత్రకారుడు :- గోలి నాగేశ్వరరావు